క్లుప్తంగా

నేడు శివలింగానికి రుద్రాభిషేకం

వెలుగోడు: పట్టణంలోని శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటలకు రామేశ్వరం నుంచి తెచ్చిన శివలింగం, 50 కలశాలకు మహన్యాస రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బల్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. అభిషేకం అనంతరము ప్రసాద వితరణ, రామేశ్వరం నుంచి తెచ్చిన 22 బావుల జలాల వితరణ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

'గడప గడప'లో విద్యుత్ సమస్యలకు పరిష్కారం

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మండలంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజల సమస్యలకు పరిష్కారం దొరికింది. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పరిష్కారం లభించింది. ఇటీవల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వెలుగోడు పట్టణం, తిమ్మనపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా వెలుగోడు పట్టణంలో 13 చోట్ల, తిమ్మనపల్లి గ్రామంలో 12 చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శనివారం ఏఈ రవీంద్రనాయక్ 25 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించారు. దీంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి స్థానికులు కతజ్ఞతలు తెలిపారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. శనివారం ఉత్సవ విగ్రహాలకు మేళతాళాలు, బాజాభజంత్రీలతో పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కాయ కర్పూరాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. అనంతరం శివాలయం వద్ద శివమాలధారులు పూజ నిర్వహించారు. వివధ గ్రామాల నుంచి భజన బృందం సభ్యులు ఆలపించిన భక్తి గేయాలు పలువురిని అలరించాయి.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం

పగిడ్యాల: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కలను సాకారం చేద్దామని ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున యువతకు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పడమర ప్రాతకోట గ్రామాల్లో యువత మేలుకో.. భవితను మలుచుకో.. డ్రగ్స్‌ను వదులుకో అన్న నినాదంతో మత్తు పదార్థాలా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థిను పట్ల అమర్యాద ప్రవర్తించడం, ఈవ్ టీజింగ్ చేయడం వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయా గ్రామాల్లో పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు.

వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలి

పాములపాడు: ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలని ఆయుర్వేద వైద్యాధికారి లావణ్య సూచించారు. శనివారం స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిత్యం యోగా చేయడం వలన శరీర దృఢత్వం పెరిగి ఆరోగ్యకరంగా ఉంటారని సూచించారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుజాత తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

ఆత్మకూరు: దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తుందని ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో క్రీడాకారులకు శనివారం క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ యువతచెడు మార్గాలను వదిలి, సన్మార్గాల్లో నడవాలన్నారు. ఆత్మకూరు క్రీడలకు పెట్టింది పేరని, ఆత్మకూరు ప్రాంతం నుంచి ఎంతో మంది క్రీడాకారులు జిల్లా, జాతీయ స్థాయిలో రాణించడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ క్రీడాకారులు ఏఎండి రఫి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ఐ చర్చి డీనరీ చైర్మన్ మృతి



మురహరి ఐజయ్య శేఖర్ (ఫైల్)

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని సీఎస్ఐ చర్చి డీనరీ చైర్మన్ మురహరి ఐజయ్య శేఖర్(66)శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీఎస్ఐ డయాసిస్ ఆఫ్ నంద్యాల బిషప్ రైట్ రేవ. ఎగ్గోని పుష్పలలిత, వైస్ ప్రెసిడెంటు పెరుమాళ్ల వరప్రసాద్, కర్నూలు, నంద్యాల జిల్లాల శాప్ కో ఆర్డినేటర్లు శ్రీనాథ్, రవికుమార్ తదితరులు మృతదేహాన్ని సందర్శించారు. ఆయన పార్థివదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. సీఎస్ఐ చర్చి సెక్రెటరీ జాన్ క్రిసోస్టం, ట్రెజరరీ జయచంద్ర, కౌన్సిల్ సభ్యులు అమల్ రాజ్, డాక్టర్ శ్రీకాంత్ ఉన్నారు.

వినిపించని పల్లె అలారం

- గ్రామాల్లో కనుమరుగవుతున్న నాటుకోళ్లు
- గతంలో పాడితో పాటు కోళ్ల పెంపకం
- మారిన జీవనంతో పోషణకు దూరం

ఒకప్పటి పల్లె కోడి కూతతో నిద్రలేచేది. గడియారాలు లేని కాలంలో గ్రామీణులకు అదే అలారం. నాడు పల్లెలోని ఏ ఇంట్లో చూసినా పదుల సంఖ్యలో నాటుకోళ్లు కనిపించేవి. ఇంట్లో మనుషులతోపాటు కోళ్లు కూడా తిరిగేవి. నేడు పల్లెసీమల జీవన చిత్రం మారిన నేపథ్యంలో కోడి కూత వినిపించడమే గగనమైంది.

నంద్యాల(అర్బన్): గతంలో..చీకటిపడుతుంటే ఎక్కడున్నా కష్టం మీద పట్టుకొచ్చి గంప కింద కప్పేసేవారు. తెల్లారుతుండగా బయటకు వదిలి గుడ్డు కోసం ఆతృతగా వెతికేవారు. సూర్యోదయానికి కొన్ని గంటల ముందే అందరిని నిద్రలేపేలా తొలికూతలు. పెట్టె కోసం పరుగులు పెట్టే పుంజులు, గుడ్లను పొదుగుతున్న కోడితో తన్నులాటలు.. దురదృష్టవశాత్తు ఇవన్నీ జ్ఞాపకాలుగా మిగిలే పరిస్థితులు నేడు నెలకొన్నాయి. జీవన విధానం మారడంతో పల్లెవాసులను నిద్రలేపే కోడి క్రమంగా ఊరికి దూరమవుతుంది.

గ్రామాల్లో కనిపించని నాటుకోళ్లు..

ఒకప్పుడు చిన్న గ్రామంలోనైనా 2వేల నుంచి 5వేల వరకు నాటుకోళ్లు ఉండేవి. జిల్లాలోని 411 గ్రామ పంచాయతీల్లో గతంలో 10 నుంచి 12లక్షల కోళ్లు ఉండగా ప్రస్తుతం 6లక్షల కోళ్లు మాత్రమే ఉన్నట్లు అధికారిక లెక్కలు పేర్కొంటున్నాయి. కోడి పుంజుల విషయం పక్కన పెడితే కోడి పెట్టలు కూడా కనిపించడం లేదు. నేడు నాటుకోళ్ల సంఖ్య భారీగా తగ్గిపోయింది. గతంలో పల్లెలోని ప్రతి ఇంటి ఆవరణలో నాటుకోళ్లు కనిపించేవి. నాటు గుడ్లను పొదిగే అలవాటు ఉండేది.పేద, మధ్యతరగతి ప్రజలు కుటుంబ అవసరాల నిమిత్తం 20 నుంచి 30 గుడ్లను పొదిగేవారు. వాటి నుంచి కోడిపిల్లలు రావడం, అవి పెరిగి పెద్దవ్వడం, బంధువులు వస్తే కోసి వండి వడ్డించేవారు. అయితే నేడు అవేవీ కనిపించడం లేదు. దాదాపు ఏ ఇంటిలోనూ కోడి జాడ కూడా కానరావడం లేదు.

నాటుకు అధిక డిమాండ్..

ప్రస్తుతం ఫారంకోళ్ల పెంపకంలో వివిధ రసాయనాలు వాడుతున్నారని ,కృతిమ పద్ధతిలో పెంచుతున్నారనే వార్తల నేపథ్యంలో నాటుకోడిని ప్రకృతి వరంగా భావిస్తున్నారు. సంక్రాంతి, దసరా పండుగలు వచ్చాయంటే ఇప్పటికీ నాటుకోడి, జొన్నరొట్టె, రాగి సంగటి కాంబినేషన్ ఉండాల్సిందే. నాడు గ్రామీణ ప్రాంతాలకు పరిమితమైన నాటుకోడి వంటకాలు పలు రూపాలను సంతరించుకొని ఇప్పుడు పట్టణాలు, నగరాల్లో మెనూలో ముందువరుసలో ఉంటున్నాయంటే వాటి ప్రాధాన్యతతను అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కేజీ నాటుకోడి ధర రూ.600 పలుకుతోంది. అలాగే వాటి గుడ్ల డజన్ రూ.72 ప్రకారం విక్రయిస్తున్నారు.



ఇంటి ఆవరణలో కోళ్లు

ఇంటి నిండా కోళ్లు ఉండేవి



నా చిన్నప్పుడు మా ఇంటి నిండా నాటుకోళ్లు ఉండేవి. మా నాన్న వాటిని ప్రత్యేకంగా పెంచేవారు. గంపల కింద ఉంచేవాళ్లం. ఇప్పుడు నాకు నలుగురు కుమారులు వారు పెద్దవారు అయ్యాక మా ఇంట్లో ఒక్క కోడి కూడ లేదు. స్థలం సమస్య, ఇంటి పక్కల వారితో ఇబ్బందులు, తదితర కారణాలతో పూర్తిగా పెంచడమే మానేశాం.

– దూదేకుల హుసేనమ్మ, కానాల

కనుమరుగవుతున్న నాటుకోళ్లు



మా గ్రామంలో నాటుకోళ్లు, అధికంగా ఉండేవి. నేడు ఎవరూ వాటిని పెంచడం లేదు. నాటుకోడి మాంసం తినాలన్నా పట్టణాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం పూట కోడి కూతలు వినిపించడం లేదు. నాటుకోడి బలమైన ఆహారం కూడా.

– సి.నికోదేవ్, లింగాపురం, కొత్తపల్లి మండలం

పోషక విలువలు అధికం



నాటు కోళ్లలో ఎక్కువ మాంసకృతులు లభిస్తాయి. నాటు కోడి గుడ్లు కూడా బలవర్ధకమైన ఆహారం. వీటిలో ఏ మిటమిన్ పుష్కలంగా దొరుకుతుంది. కోళ్లకు సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాక్సిన్‌లు వేయించాలి.

–వెంకటసుబ్బారెడ్డి, ఏడీ జిల్లా పశువైద్యశాల

ఆర్టీసీ బస్సు బోల్తా .. ఆరుగురికి గాయాలు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ సమీపంలో కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు బోల్తా పడంటంతో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్నూలు నుంచి ఏపీ 05 జెడ్ 5094 నంబర్ గల ఏపీఎస్ ఆర్టీసీ బస్సు (సూపర్ లగ్జరీ) 30 మంది ప్రయాణికులతో కాకినాడకు వెళ్తోంది. ఈ క్రమంలో ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన వారికి 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

డ్రమ్‌సీడర్ పద్ధతి ఉపయోగకరం

మహానంది: డ్రమ్‌సీడర్ పద్ధతి చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. బొల్లవరం గ్రామ పరిసరాల్లో శనివారం డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా సాగుచేసిన పొలాలను పరిశీలించారు. ఏఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ డ్రమ్‌సీడర్ విధానం ద్వారా విత్తనం వలన కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ విధానం ద్వారా సాగుచేసే పంటల్లో చీడపీడలు తక్కువగా ఉండటం ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. మండలంలోని బొల్లవరంలో సుమారు 30 ఎకరాల్లో డ్రమ్‌సీడర్ విధానం ద్వారా వరి సాగు చేస్తున్నారని చెప్పారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

వెలుగోడు : మండల పరిధిలో నీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ లాలం రమేష్ ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మాధవరం, వెలుగోడు పట్టణంలోని ఇందిరానగర్, అబ్దుల్లాపురం గ్రామాల్లో మంచినీటికి ఇబ్బందిగా ఉందని పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీపీ దష్టికి తీసుకొచ్చారు. ఏఏ ప్రాంతాలలో ఇబ్బందులు ఉన్నాయో గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. చేతిపంపులకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వేల్పనూరు ఎంపీటీసీ జనాభారెడ్డి మాట్లాడుతూ..విద్యారంగం సమస్యలు చెప్పుకుందామంటే ఎంఈవో సమావేశానికి రాలేదన్నారు. మండల మీట్లో సభ్యులు చెప్పిన సమస్యలు కేవలం నోట్ బుక్‌లో రాసుకునేందుకే పరిమితమయ్యారని, ఏయే సమస్యలు పరిష్కారం అయ్యాయో తరువాతి సమావేశంలో చెబితే బాగుంటుందన్నారు. వైస్ ఎంపీపీ నసిరుద్దీన్ మాట్లాడుతూ..గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ షేక్ అమానుల్లా, టీడీ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, వైస్ ఎంపీపీలు కొడావత్ శంకర్ నాయక్, నసిరుద్దీన్, ఎంపీటీసీలు చాంద్‌బాషా, సర్పంచ్‌లు వేల్పుల జయపాల్, బ్రహ్మానందరెడ్డి, సర్దార్‌మియా, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లాలం రమేష్

క్యూలైన్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టండి

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు స్వామివారి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు క్యూలైన్లను పకడ్బందీగా నిర్వహించాలని దేవస్థానం ఈఓ ఎస్ లవన్న సూచించారు. శనివారం మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలనలో భాగంగా క్యూలైన్లు , క్షేత్ర పరిధిలోని శౌచాలయాలను, కొబ్బరికాయల గోడౌన్‌ను, కౌంటర్‌ను పరిశీలించారు. ఇందులో భాగంగా క్యూలైన్లలో ఎటువంటి తొక్కిసలాటకు తావులేకుండా తగిన స్థాయిలో సెక్యూరిటీ సిబ్బందిని, శివసేవకులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. క్యూకాంప్లెక్స్‌లో నిరంతరం అల్పాహారం మంచినీరు, బిస్కెట్లు అందిస్తుండాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో భా గంగా ఉచిత దర్శనం, శీఘ్రదర్శనం(200), అతిశీఘ్రదర్శనం (500) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాదయాత్రలో వచ్చిన భక్తులకు అటవీమార్గంలో ప్ర త్యేక బ్రిస్ట్ బ్యాండ్ అందజేస్తామని, వారికి ప్రత్యేక క్యూ లైన్ ద్వారా దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు. ఈఈ వి.రామకృష్ణ, ఏఈఓ ఫణిదరప్రసాద్, డీఈఈ నరసింహారెడ్డి, పర్యవేక్షకులు అయ్యన్న పాల్గొన్నారు.



శివరాత్రి ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఈఓ

తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమే



మాట్లాడుతున్న డాక్టర్ మహమ్మద్‌బేగ్

ఆత్మకూరు: క్యాన్సర్‌వ్యాధి ప్రమాదకరం కాదని, తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను నివారించవచ్చని డాక్టర్ మహమ్మద్‌బేగ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ నాలుగు దశలుగా ఉంటుందని, మొదటి దశలో చికిత్సలు తీసుకుంటే నివారించవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కృష్ణ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం వలన ఊపిరితిత్తుల క్యాన్సర్, కాలేయ క్యాన్సర్, రక్తక్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. యువత వాటి దూరంగా ఉండాలన్నారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ పద్మావతి బాయి, అధ్యాపకులు వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వడ్డీ చెల్లిస్తే పంట రుణాలు రెన్యువల్

జూపాడుబంగ్లా: సకాలంలో పంట రుణాల వడ్డీ చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ పీఎస్ నవీన్‌కుమార్, మేనేజర్ ఆదినారాయణరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని తాటిపాడు గ్రామంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలపై ఖాతా దారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పంటరుణాలను తీసుకున్న రైతులు గతంలో అస్సలు, వడ్డీలు చెల్లించి రుణాలు రెన్యువల్ చేయించుకోవాల్సి ఉండేదన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిబంధనలను సవరించి కేవలం వడ్డీ మాత్రమే చెల్లిస్తే రుణాలను రెన్యువల్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంటు రాంబాబు, బీజీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం బహూకరణ

బండిఆత్మకూరు ఎ.కోడూరు గ్రామంలోని సంజీవ రాయ స్వామి విగ్రహానికి శనివారం 25 తులాల వెండి కిరీటాన్ని మాజీ సర్పంచ్ వడ్డు వెంకటసుబ్బారెడ్డి, వడ్డు నాగరత్నమ్మ దంపతుల కుమారుడు వడ్డు మధుసుధన్‌రెడ్డి శనివారం బహూకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులకు, పూజారులు స్వామివారికి పూజలు నిర్వహించి వెండి కిరీటాన్ని అలంకరించారు. అలాగే గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయానికి రెండు ఫ్యాన్లు, గోడ గడియారం అందజేశారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడే లక్ష్యం

పాములపాడు: తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏడీఏ బి.ఆంజనేయ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రగూడూరు గ్రామంలో ఏఓ ఫణీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మినుమపంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మినుము పంటలో ఆకర్షక పంటలుగా ఆముదం, అలసంద, రక్షక పంటగా జొన్న వేసుకోవడం వలన ఉపయోగాలను రైతులకు వివరించారు. మినుము పంటలో రసంపీల్చు పురుగుల నివారణకు, పుసుపు నీలం రంగు జిగురు అట్టలను 10 నుంచి 20 ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆదే విధంగా లింగాకర్షక బుట్టలను పెట్టుకోవాలన్నారు. అదేవిధంగా లింగాల, ఇస్కాల, జూటూరు, పాములపాడు, మద్దూరు గ్రామాలలో రబీ 2022–23 సీజన్‌కి సంబంధించి పంట నమోదు చేసుకున్న రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీఆర్‌సీ వ్యవసాయాధికారి హేమలత, ఏఈఓ మద్దిలేటి పాల్గొన్నారు.



ఎదురుపాడు గ్రామంలో వేరుశనగ పంటలో వివరాలు సేకరిస్తున్న ఏడీఏ ఆంజనేయ

ఈ–క్రాప్ నమోదుపై సూపర్ చెక్

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు, కొక్కెరంచ గ్రామాలలో రబీపంటలను ఏడీఏ ఆంజనేయ సూపర్ చెక్ చేశారు. ముందుగా పంటపొలాల్లో తిరిగి రైతులను సాగు వివరాలను, పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌బీకేలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటనారాయణ, ఆర్‌బీకే సిబ్బంది అశోక్, మహమ్మద్ షఫి, వీఆర్వో రహీం పాల్గొన్నారు.

వెలుగోడు: మండల పరిధిలో ఈ–క్రాప్ నమోదుపై ఏడీఏ ఆంజనేయులు శనివారం తనిఖీ చేశారు. ప్రతి రైతు వివరాలను వ్యక్తిగతంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో సునీత, ఏఈవో నాగశివసాయి, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో విచారణ

కొత్తపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఆత్మకూరు ఆర్‌డీఓ దాసు, జిల్లా బాలిక సంరక్షణ అధికారిణి శారద శనివారం విచారణ చేపట్టారు. గతేడాది డిసెంబర్‌లో పదో తరగతి విద్యార్థిని కీర్తి చెంపపై టీచర్ కాల్చిన ఘటనపై పాఠశాలలోని పీఈటీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. వారిని విడివిడిగా పిలిచి విచారించారు. సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్డీఓ తెలిపారు. తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, పీఏఎల్ఆర్ డీటీ పెద్దన్న, ఆర్ఐ జహంగీర్ పాల్గొన్నారు.

జగనన్న గోరు ముద్ద పరిశీలన

పాములపాడు: మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ బాలాజీ నాయక్ శనివారం జగనన్న గోరు ముద్ద అమలు తీరును పరిశీలించారు. ప్రతి రోజు ఆహార పట్టికలోని మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని మలేరియా కార్యాలయం వద్ద టీబీ ముక్త్ భారత్ అభియాన్ పథకం కింద క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లను శనివారం అందజేశారు. బైర్లూటి వైద్యాధికారులు పవన్‌కుమార్, గోపాల్ మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు ముందుకు వచ్చి నెలకు రూ.500 విలువ చేసే కిట్లను 6 నెలలు అందించి ఆదుకోవాలని కోరారు. ప్రస్తుతం ఆత్మకూరు, వెలుగోడు మండలాల్లో 20 మంది వ్యాధి గ్రస్తులకు 6నెలల పాటు నెలకు రూ.10 వేలు విలువ చేసే పౌష్టికాహార కిట్లను నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, సౌజన్య, మహమ్మద్ పాల్గొన్నారు.

కుర్చీల విరాళం

పాములపాడు: మండల పరిధిలోని వేంపెంట గ్రామంలోని అంగన్‌వా కేంద్రానికి పాములపాడు పశువైద్యాధికారి భాస్కర్ శనివారం కుర్చీలు బహూకరించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వా టీచర్ నాగమణి, ఆయాలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

జూపాడుబంగ్లా: బాల్యవివాహాలు చేయటం చట్టరీత్యానేరమని నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు తెలిపారు. శనివారం నందికొట్కూరు కోర్టు ఆవరణలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ చట్ట ప్రకారం అమ్మాయిలకు 18ఏళ్లు, అబ్బాయిలకు 21ఏళ్ల వయస్సు నిండేవరకు తల్లిదండ్రులు వివాహాలు చేయరాదన్నారు. నిర్ణీత వయస్సు కంటే తక్కువగా ఉంటే వాటిని బాల్యవివాహాలుగా పరిగణించి, అందుకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటారన్నారు. అంతేకాకుండా మహిళల్లో అనేక సమస్యలు తలెత్తటంతో పాటు పుట్టేపిల్లలు ఎదుగుదల లోపించే పుట్టే అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ సెక్రెటరీ శరభయ్య, తహసీల్దార్లు రాజశేఖర్‌బాబు, పుల్లయ్యయాదవ్, సిరాజుద్దీన్, భారతి, సీఐలు విజయభాస్కర్, సుధాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ, ఉర్దూ అకాడమి డైరెక్టర్ షకూర్‌మియ్య, మత పెద్దలు సయ్యద్‌జలాల్, చంద్రశేఖర్, ఇమ్మానియేల్, సోషల్ వర్కర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి తిరుమలరావు

సమష్టి కృషితో లక్ష్యాలు పూర్తి చేయాలి

పగిడ్యాల: సమష్టి కృషితో ఉగాది పర్వదినానికి ఇంటి నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పగిడ్యాల 1, 2, 3 సచివాలయం పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీస్‌లు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసి స్టెంట్స్, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వలంటీర్‌ల సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. నిర్మాణాలు ప్రారంభించకపోతే అవగా హన కల్పించి బేస్‌మెంట్ పనులు చేప ట్టాలని సూచించారు. హౌసింగ్ ఏఈ జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, మంజులవాణి, కోట్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

మహానంది: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఈఈ మాధవరావు సూచించారు. సీతారామాపురం గ్రామంలో శనివారం జగనన్నకాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. హౌసింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి, కాలనీలు సందర్శించి గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, హౌసింగ్ ఏఈ వాసుదేవుడు, ఏపీఓ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యపై డీఎల్‌పీఓ పరిశీలన

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య, పైప్‌లైన్ మరమ్మతు సమస్యలపై ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి కవిత ఆరా తీశారు. శనివారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించిన డీఎల్‌పీఓకు కాలనీవాసులు పలు సమస్యలను విన్నవించారు. కాలనీలో వేసిన సీసీ రోడ్లపైకి టాయిలెట్ల నీటిని మళ్లించి ఇబ్బందులు కలిగించడం మంచిది కాదని డీఎల్‌పీఓ కాలనీవాసులకు సూచించారు. ఇళ్ల వద్దనే ఇంకుడు గుంతలు తీయించుకోవాలని, అందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 4 వేలు ఆర్థిక సాయం అందిస్తారని తెలియజేశారు. వివాదాస్పదమైన పైప్‌లైన్ సమస్యను పరిష్కరించి కాలనీవాసులకు నీటి ఎద్దడి లేకుండా పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి సమతయశోదర, గ్రామ సర్పంచ్ సుజాతకు సూచించారు. ఈఓఆర్డీ పుల్లయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ విష్ణు తదితరులు ఉన్నారు.



ఎస్సీ కాలనీలో విచారిస్తున్న డీఎల్‌పీఓ కవిత

ఓటరు జాబితా తయారీకి ఆదేశాలు

జూపాడుబంగ్లా: మండలంలో ఖాళీగా ఉన్న వార్డుమెంబర్లు, ఎంపీటీసీ స్థానాల ఎన్నికల నిమిత్తం ఫొటో ఆధారిత ఓటరు జాబితాలను తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయమై శనివారం జూపాడుబంగ్లా ఎంపీడీఓ మంజులవాణి, నందికొట్కూరు ఎంపీడీఓ శోభారాణి మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలంలోని తర్తూరు 2 వార్డు, జూపాడుబంగ్లా 7వార్డు సభ్యులు, తర్తూరు, తాటిపాడు గ్రామాల్లోని ఎంపీటీసీ స్థానాలు, నందికొట్కూరు మండలంలో నాగటూరులో 8 వార్డు స్థానం ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా స్థానాలకు సంబంధించిన ఫోటో ఆధారిత ఓటరు జాబితాను తయారుచేసి ఈనెల 27న పబ్లిష్ చేయనున్నట్లు తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

జూపాడుబంగ్లా: ఏపీ అంతర్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటినట్లు హెచ్ఎం సాయితిమ్మయ్య, పీఈటీ అరుణ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. లక్ష్మీనరసింహస్వామి, కేజీ నవీన్, హేమలత రజత పతకాలు సాధించారన్నారు. మిగిలిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు లభించాయని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రత్నం ఏసేపు, సీనియర్ ఉపాధ్యాయురాలు లక్ష్మిదేవి, ఉపాధ్యాయులు పార్వతి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో హెచ్ఎం సాయితిమ్మయ్య

రైతులకు గోనెసంచుల పంపిణీ

మిడుతూరు: తలముడిపి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు శనివారం గోనెసంచులను పంపిణీ చేశారు. 2020–21 రబీ సీజన్‌లో రైతులు పండించిన మొక్కజొన్నలను రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా నందికొట్కూరు మార్కెట్‌యార్డు, నందికొట్కూరు పరపతి సహకార సంఘం (పీఏపీఎస్), మిడుతూరు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో కొనుగోలు చేశారు. అప్పట్లో ప్రభుత్వం రైతులకు అందజేసేందుకు ఖాళీ సంచులు, రవాణా ఖర్చులు మంజూరు చేసింది. అయితే ఆయా సంస్థల అధికారులు రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి, రైతులకు సంచులను పంపిణీ చేయలేదు. ఈ విషయాన్ని తలముడిపి సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు వంగాల సీతారామిరెడ్డి ఇటీవల సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి తీసుకొచ్చి, నంద్యాల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా రైతులకు గోనెసంచులు పంపిణీ చేయకుండా వారి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు తేలింది. దీంతో రైతులకు గోనెసంచులు అందజేయాలని కలెక్టర్ మనజీర్ జీలానీ శామూన్ ఆదేశాలు జారీ చేయడంతో శనివారం తలముడిపిలో రైతులకు మొక్కజొన్నలకు సంబంధించి రూ.13 లక్షల 70వేలు విలువైన 49 వేల సంచులు గోనె సంచులను పంపిణీ చేశారు.



గోనెసంచులను తీసుకెళ్తున్న రైతులు

రైతులందరికీ సంచులు పంపిణీ చేయాలి

2020 రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన మొక్కజొన్న రైతులకు సంబంధించిన గోనెసంచులను రైతులకు అందరికీ అందజేసేలా చర్యలు తీసుకోవాలని తలముడిపి గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు వంగాల సీతారామిరెడ్డి డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని తలముడిపి గ్రామంలో మాత్రమే రైతులకు గోనెసంచులు అందజేశారని, నాగలూటి, మాసపేట, కడుమూరు, వీపనగండ్ల, తిమ్మాపురం, చెరుకుచెర్ల, అలగనూరు, జలకనూరు గ్రామాల రైతులకు కూడా సంచులు, రవాణా ఖర్చులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సంచుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కాతా అంకిరెడ్డి, చక్రి, రైతులు పాల్గొన్నారు.